క్లుప్తంగా

140 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనం, గంజాయి

నక్కపల్లి: జాతీయరహదారిపై నక్కపల్లి ఆస్పత్రి సమీపంలో శుక్రవారం స్థానిక పోలీసులు 140 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎస్ఐ విభీషణ్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని వాహనంలో ముగ్గురు వ్యక్తులు మహారాష్ట్ర తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకున్నట్టు చెప్పారు. గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

20న వాడ్రాపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో ఈ నెల 20న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయం ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వం ద్వారా ఇంతవరకు అందిన సంక్షేమ పథకాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

21న మండల సమావేశం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశమందిరంలో ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమతుందన్నారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన పరిష్కార చర్యల నివేదికలు, గత సమావేశం తర్వాత జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వులు, శాఖల ప్రగతి నివేదికలతో అధికారులు హాజరు కావాలని కోరారు. సమావేశం అజెండా వివరాలను సభ్యులకు తెలియజేసినట్టు చెప్పారు.

బాల్య వివాహాలు వద్దే వద్దు



బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోటవురట్ల: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయని, వాటిని అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమ సూచించారు. స్థానిక కేజీబీవీలో బాల్య వివాహాల వల్లే కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలు తలపెడితే పిల్లలు ఎదురించాలని,పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ లోవరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మజ, మంగమ్మ, అప్పలనర్స పాల్గొన్నారు.

కాలువలు, గ్రోయిన్ల మరమ్మతులకు చర్యలు



కాలువలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ జగదీశ్వరరావు

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఇరిగేషన్ కాలువలు, గ్రోయిన్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్టు ఇరిగేషన్ డీఈ జగదీశ్వరరావు తెలిపారు. మండలంలో సర్వసిద్ధి, ఎస్.రాయవరం, పెదఉప్పలంలో శుక్రవారం పర్యటించి గ్రోయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మరమ్మతులు చేపడతామని చెప్పారు.

యువతి అదృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం దిబ్బపాలెంలోని సెజ్ కాలనీకి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైంది. డిగ్రీ చదివిన ఆ యువతి ఈ నెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.



జానకయ్యపేటలో నాగుల చవితి సంబరాల్లో పాల్గొన్న ప్రజలు



మునగపాకలో నాగుల చవితి వేడుకల్లో ఒకచోట కలుసుకున్న వేగి కుటుంబ సభ్యులు



యలమంచిలి భవనం వీధిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నాగేంద్రాయ పాహిమాం.. పాపనాశనాయ రక్షమాం

- భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి పూజలు
- నందడిగా నాగుల చవితి వేడుకలు

నాగేంద్రా రక్షించు.. అని వేడుకుంటూ పల్లెలు, పట్టణాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగుల చవితి సందర్భంగా కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపి, గుడ్లు వేసి, పాలు పోశారు. చలిమిడి ప్రసాదాలను సమర్పించి, నీరాజనాలు పలికారు.



యలమంచిలి నాగేంద్రుని ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



పాయకరావుపేట పొలాల్లో పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో పూజలు చేస్తున్న ఉమ్మడి కుటుంబ సభ్యులు



కొరుప్రోలులో పుట్టలో పాలుపోస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

యలమంచిలి(అనకాపల్లి రూరల్)/మునగపాక/రాంబిల్లి/అచ్యుతాపురం (అనకాపల్లి):యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వేకువజాము నుంచే కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేశారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచాను కాల్చారు. పట్టణంలోని నాగేంద్రకాలనీలో ఉన్న నాగేంద్రుని గుడికి భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చవితి సందర్భంగా ఆలయ పరిసరాలు, వీధి రోడ్లకిరువైపులా విద్యుద్దీపాలతో అలంకరించారు. మరోవైపు గ్రామాల్లో రైతులు సంప్రదాయం ప్రకారం సాయంత్రం వేళ తమ కుటుంబ సభ్యులతో పంట పొలాలకు వెళ్లారు. మునగపాకమండల కేంద్రం మునగపాకలో పెంటకోట రామయ్య, వేగి కుటుంబ సభ్యులంతా కలిసి వేడుకలను జరుపుకొన్నారు. పుట్టల వద్ద మందుగుడు వెలిగించి సందడి చేశారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో నాగుల చవితి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు జరిపారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

నక్కపల్లి/పాయకరావుపేట/కోటవురట్ల/ఎస్.రాయవరం: నక్కపల్లి మండలంలోని దేవవరం, నక్కపల్లి, వేంపాడు, గొడిచర్ల, ఉద్దండపురం, జానకయ్యపేట, ఉపమాక, చినదొడ్డిగల్లు, రేబాక తదితర గ్రామాల్లో రైతులు నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. పాయకరావుపేట, తుని పట్టణ ప్రాంత ప్రజలు పుట్టల కోసం గ్రామాలకు తరలివచ్చారు. ఒకే ఇంటిపేరుతో ఉన్న వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబాల వారంతా చవితి రోజు స్వగ్రామాలకు తరలివచ్చి బంధువులు, కుటుంబ సభ్యులతోకలసి పుట్టల్లో పాలుపోశారు. పాయకరావుపేట మండలం వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి, దీపారాధనలు జరిపారు. రాంబిల్లిమండలంలో పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి పూజలు చేశారు.



దిమిలిలో పుట్ట వద్ద భక్తులు

పుట్టలో పాలు వేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చారు. కోటవురట్లమండలంలో నాగులచవితిని శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టల వద్దపాలు, గుడ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్.రాయవరం మండలంలో శుక్రవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కొరుప్రోలు గ్రామంలో కొబ్బరి తోటలోని పుట్టలో పాలు పోసి నాగేంద్రుడికి పూజలు చేశారు. భార్యా సమేతంగా ఎమ్మెల్యే ముందుగా సూర్యుడికి నమస్కరించి, అనంతరం నాగుల చవితి వేడుకలు నిర్వహించారు.



జానకయ్యపేటలో చవితి వేడుకలు జరపుకుంటున్న భక్తులు



కోటవురట్లలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

మల్లవరంలో ఘనంగా జాజులమ్మ పండగ



జాజులమ్మ పండగలో బుట్టలు మోస్తున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం మల్లవరంలో శుక్రవారం జాజులమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదీ నాగుల చవితి రోజున సంప్రదాయబద్ధంగా ఈ పండగ నిర్వహిస్తారు. గ్రామంలో దీపావళి పర్వదినాన గీసాల నాగమణి ఇంటిలో బుట్టల్లో మట్టిని వేసి నవదినుసులు జల్లారు. ఈ బుట్టల్లో నవదినుసులు మొలకెత్తాయి. గౌరీదేవిగా భావించే జాజులమ్మ (నవదినుసుల మొలకల) బుట్టలను నాగులచవితి నాడు గ్రామస్తులు తలపై మోస్తూ భజనలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సాగు నీటి కాల్వలో వదిలారు. అవివాహితులు జాజులమ్మ వారిని పూజించి, బుట్టను తలపై పెట్టుకుంటే పెళ్లవుతుందని, పిల్లలు లేని వారికి సంతానం కలుగుతుందని నమ్మకం. ఈ ఉత్సవంలో సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, పిన్నమరాజు రవీంద్ర, చోడపల్లి రమణ,అడపా మహాలక్ష్మి,మాజీ సర్పంచ్ కండిపల్లి శ్రీనివాసరావు, చల్లా సూరిబాబు, శివ, రమణ, గీసాల లోవ, గండిబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రోగికి మందులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయన్నారు. డాక్టర్ విమలగిరి వైద్య సేవలందించారు.సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుష్టురహిత సమాజం కోసం కృషి



మాట్లాడుతున్న వైద్యాధికారి విమలగిరి

మునగపాక: కుష్టురహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టువ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. అపోహలు లేకుండా వ్యాధి గ్రస్తులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. ఎవరికైనా ఐదు లోపు మచ్చలుంటే ఆరు నెలలు, అయిదు కన్నా ఎక్కువ మచ్చలుంటే సంవత్సరం పాటు మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. స్పర్శలేని రాగి రంగులో మచ్చలుంటే ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించాలని తెలిపారు. సీహెచ్‌వో దేవకాంత,ఆరోగ్య పర్యవేక్షకులు వీఎస్ఎం లక్ష్మి, ఎం.ఉమామహేష్, ,ఎంఎల్‌హెచ్‌పీ యామిని ప్రియ, ఏఎన్ఎం శ్రీ రమణ,హెల్త్ ఆఫీసర్ విశ్వనాథం, ఆశ కార్యకర్తలు రూప.పద్మావతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయ్యప్ప నిత్యాన్నదానానికి రైతు సంఘం వితరణ



బియ్యం బస్తాలు అందిస్తున్న రైతు సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీ సంఘం అయ్యప్పస్వామి ఆశ్రమంలో అయ్యప్ప భక్తు లకు నిత్యాన్నదానం చేస్తున్న సంఘ సభ్యులకు రైతు సంఘం ఆశ్రమం తరఫున 30 బియ్యం బస్తాలు, 5 నూనె డబ్బాలు, కొంత నగదు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రతినిధులు కొణతాల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఏటా ఆశ్రమంలో ఉన్న స్వాములకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అయ్యప్ప మాలధారులు మళ్ల సురేంద్ర, పీలా రాముడు, సూరిబాబు, కొణతాల పండు, పీలా శ్యామ్ పాల్గొన్నారు.

జనజాతర

ఆధ్యాత్మిక పరిమళం-సాంస్కృతిక మేళవింపు



జాతర తిలకించేందుకు వస్తున్న జనం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణం పరవశించింది. పంచరాత్రుల శోభతో యలమంచిలి కాంతులీనింది. ఇసుకేస్తే రాలనంతగా రహదారులు జనాలతో కిక్కిరిసిపోయాయి.ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పంచరాత్రి ఉత్సవాల ముగింపు రోజైన శుక్రవారం యలమంచిలి రోడ్లు కిటకిటలాడాయి. ఒకవైపు ఆధ్యాత్మిక పరిమళం, మరోవైపు సాంస్కృతిక వినోదం మేళవింపుతో భక్తులు పరవశించిపోయారు. దీపావళి నుంచి నాగుల చవితి వరకూ ఐదు రోజుల పాటు పట్టణంలో జరిగే పంచరాత్రి ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ ఏడాది కూడా ఘనంగా ఏర్పాట్లు చేశారు. ముగింపు రోజైన శుక్రవారం సాయంత్రం నుంచి తెల్లవారేవరకూ భక్తజనంతో రహదారులు రద్దీగా కనిపించాయి. రాత్రి 7 గంటల నుంచి కాలు కదపడమే కష్టమన్నట్టుగా జనంతో ప్రధానరహదారి, తులసీనగర్, పాతవీధి, దిమిలిరోడ్డు, మార్కెట్ ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.



సాంస్కృతిక కార్యక్రమాలు



జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన



కోటవురట్లలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



చినదొడ్డిగల్లులో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించి, సభ్యత్వ నమోదు చేశారు. అనంతరం గ్రంథాలయాలు- వాటి ప్రయోజనాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు శివకోటి దుర్గా ప్రసాద్, ప్రసాదరావు తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మునగపాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠకులకు అవసరమయ్యే పలు రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నక్కపల్లి: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ తెలిపారు. వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేసినట్టు ఆయన చెప్పారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించినట్టు తెలిపారు

పుస్తక ప్రదర్శన

పాయకరావుపేట: పట్టణంలోని గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిపాజిట్లు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, గ్రంథాలయా అభివృద్ధి కమిటీ సభ్యులు టి.వెంకటేశ్వరరావు, ఎస్.టి.సీతారామయ్య, అచ్యుతరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు ఈ నెల 23 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి సూరి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో గవరపాలెం నిదానందొడ్డి బాబా మందిరంలో 23వ వరకు రోజువారీ వివిధ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

- ➡ 18న ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం.
- ➡ 19న విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ సత్యసాయి మహిళా దినోత్సవం సందర్భంగా పేదలకు చీరలు, దుప్పట్లు, అమృత కలశాల పంపిణీ, సాయంత్రం నామసంకీర్తన, గిరిజా స్పందన సహకారంతో సిరిసంపద నృత్యం వారిచే కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన.
- ➡ 20న శివ స్తోత్ర పారాయణం, వివిధ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు.
- ➡ 21న హనుమాన్ చాలీసా పారాయణం, సత్యసాయి పల్లకీ సేవ, మహానగర సంకీర్తన, కోలాటాలతో ఊరేగింపు.
- ➡ 22న సత్యసాయి వ్రతాలు, రాత్రి 7 గంటలకు నామసంకీర్తన.
- ➡ 23న షిర్డీసాయి చాలీసా పారాయణం, సత్యసాయి రుద్రాభిషేకం, అన్నసమారాధన, సాయంత్రం నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ, సత్యసాయి జయంతి పురస్కరించుకుని కేక్ కటింగ్, స్వామివారి ఊంజల్‌సేవ, మంగళహారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

నేటి నుంచి జల్ జీవన్ పనులు

ఎస్.రాయవరం: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండల కేంద్రం ఎస్.రాయవరంలో కుళాయిల ఏర్పాటుకు పైపు లైన్లు వేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు తెలిపారు. పైపులైన్ల కోసం గ్రామంలో సీసీ రోడ్లను తవ్వుతుంటే స్థానికులు అభ్యంతరం చెబుతున్నారు. రోడ్లను ధ్వంసం చేస్తున్నారని అడ్డుకోవడంతో కొన్ని రోజులుగా నిలిచిపోయిన పనులు శుక్రవారం నుంచి మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు శ్రీనివాసరావు చెప్పారు. పైపులైన్ల కోసం తవ్వుతున్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు అడ్డుతొలగారు.

ఘనంగా నాగదుర్గమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో వేంచేసిన నాగదుర్గమ్మ జాతర మహోత్సవం శుక్ర వారం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం అమ్మ వారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పుట్టకు పూజలు చేసి, పాలు పోశారు. అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నేల వేషాలు, రాత్రి 7 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.